# ప్రబోధ 26

సకల శాస్త్ర పురాణ సంగ్రహ వేత్తయై
వేదాంత వేద్యుడౌ విబుధుడైన
రక్తి ఏపారగ రమ్య హర్మ్యంబుల
రమియించు రాజ చంద్రముడునైన
రణరంగమందు పరాభూతరిపుడౌచు
వెల్గొందు జగదేక వీరుడైన
దారిద్ర్య దేవతా దాక్షిణ్యమున కుందు
దౌర్భాగ్య విభుడగు దాసుడైన
భక్తి లేనిచో ఎందుకు పనికి రాడు
భక్తి లేనట్టి ఆ జగద్భర్త కన్న
భక్త పరుడగు దాసుడే భవ్యుడగును

అనిర్వచనీయమ్ భక్తి. ఇది వర్ణించుటకు సాధ్యము కానిది. లోకమున గల అనేక సాధనలయందు కూడను భక్తి సులభము. శ్రేష్ఠమైనది. భజ్ అనే ధాతువునకు తి అనే ప్రత్యయము చేర్చిన భక్తి అనే పదము ఏర్పడుతుంది. భక్తి అనగా సేవ. కొలువు. ఇది భయముతో కూడిన స్నేహము. త్రిగుణాత్మకమైన తత్త్వమును, త్రిగుణాతీతమైన శక్తితో పోల్చుకొనుట యందు కొంతవరకును వినయ విధేయతలు కూడను అత్యవసరము. భజ సేవాయాం. త్రిగుణములతో మనోవాక్కాయ కర్మలచేత దివ్యత్వమును సేవించుటయే భక్తి. భక్తి అనగా పరిపూర్ణప్రేమ. భక్తి ప్రేమలు అవినాభావ సంబంధములు. ఇవిరెండును అన్యోన్యాశ్రయములు. ముక్తికి సాధన భక్తి. భక్తికి రూపము ప్రేమ. అఖండమైన ప్రేమతో భగవంతుని సేవించటమే ప్రధాన భక్తియని నారదుల యొక్క భావము. ఆరాధనలయందును, అర్చనలయందును ప్రేమ అనురక్తి కలిగినది వ్యాసులవారి భావము. త్రికరణ శుద్ధితో సేవలు గావించి అర్పితము గావించుకొనే చిత్తమునకు భక్తియని గార్గ ఋషి అభిప్రాయము. మనసును అదుపులో నుంచుకొని భగవంతుని వైపు మరల్చి దివ్యమైన ఆనందమును అనుభవించటమే నిజమైన భక్తియని యాజ్ఞవల్క్యుని యొక్క ప్రభావము. చిత్తమును ఆత్మవైపు మరల్చి ఏకత్వమైన

ఆనందమును అనుభవించటమే భక్తి అని మహనీయులు అనేక విధములుగా బోధించుతూ వచ్చినప్పటికిని ఏతావాతా ప్రధానమైనది ప్రేమ ఒక్కటి మాత్రమే.

ప్రతి మానవుని యందు కూడను అంతో యింతో ప్రేమ ప్రవహిస్తూనే వున్నది. పరమప్రేమ స్వరూపుడైన పరమాత్మయందు జీవుడు ఒక అంశముగా ఆవిర్భవిస్తున్నాడు. మానవుడు కూడను ప్రేమ స్వరూపుడే. కానీ యీ మానవుడు ప్రాకృతమైన మార్గములో ప్రవేశపెట్టటం చేత, ప్రవహించటం చేతను యిది మాలిన్యమవుతున్నది. ఈ మాలిన్యముతో కూడిన పరమ ప్రేమ రసమునందు భగవంతుని సుందరము భారవిందము అంత స్పష్టముగా కనుపించుటకు వీలుకాదు. భక్తి అనగా కేవలము పూజించటము, ధ్యానించటము, జపించటము అనే మనము భావిస్తున్నాము. అనిర్వచనీయమైన ఆనందానుభూతిని అంతరాత్మ ద్వారా అన్వేషణ జరపటమే భక్తి. ఇది జీవుడు పరమాత్మతో కూడిన అధ్యాత్మ రతియ అని కూడను చెప్పవచ్చును. హృదయ కుహరము నుండి ఆర్తుడై ప్రార్థించిన ప్రార్థన చిత్తము నుండి ఆవిర్భవించి, యిది ఒక అఖండమైన ప్రవాహముగా రూపొంది ప్రేమగా మారటమే యిది ఒక భక్తి. ప్రేమ యొక్క మానసిక పరివర్తనే భక్తి అని కూడను మరొక పేరు. ప్రేమ చేత ప్రేమను పొందటమే ప్రధానమైన భక్తి. ఈ ప్రేమ బాహ్యమైన ప్రాకృత సంబంధమే కాక, పరతత్వమైన అనన్యమైన, సాధ్యమైన పరమ ప్రేమకు సంబంధించి వుండాలి. ప్రార్థన అనగా కేవలము అడుక్కోటం మాత్రము కాదు. తనయొక్క ఆర్తిని, తనయొక్క బాధను తనయొక్క కోరికను పరమాత్మునితో చెప్పుకొనటమే. తనయొక్క గమ్యమును, తనయొక్క ధన్యమును, తనయొక్క పుణ్యమును పరమాత్మునికి అర్పితము గావించటమే. కనుక భక్తి అనేది కేవలము లౌకికమైన కార్యకలాపములందే కాక హృదయ పరివర్తనయందును, హృదయ ప్రవృత్తి యందును యిది మిళితమై వుండాలి.

భగవంతునితో ఏకత్వమును కోరే దివ్యతత్వమే భక్తి. ఇది రెండు విధములుగా వుంటున్నాది. విద్యల ద్వారా ఈశ్వరత్వము యొక్క వైజ్ఞానమును గుర్తించి, తద్వారా తాను తరించటము యిది సహజముగా జన్మతః ప్రారంభమై, మానసిక ప్రవృత్తులను అనేక రకములైన ఏకత్వము గావించి తాను తరించి యితరులను తరింపజేసే ఈశ్వర ప్రేమనే సహజ భక్తి. విద్యవలన, వైజ్ఞానము వలన ఈశ్వరత్వము యొక్క శక్తిని గుర్తించిన వ్యక్తి మాత్రమే తాను తరించగలడు. సమాజముతో యేర్పడిన భక్తి ప్రవృత్తులు తాను తరించటమే కాకుండా తన తోటి మానవులను కూడను తరింపజేసే శక్తి సామర్థ్యములు కలిగి వుండటము యిది రెండవ భక్తి. సా-తరతి సాలోకం తారయతి. అనగా తాను తరించటము యితరులను తరింపజేయటము. మానవత్వమునందు అనంతమైన ప్రేమ ప్రవాహ

మనేది అఖండముగా ప్రవహిస్తూనే వున్నది. ఈ ప్రేమను ప్రాకృతమైన మార్గమున మరల్చి తద్వారా ప్రాకృతమైన వాంఛలయందు యీ ప్రేమను అంకితమొనరించి తద్వారా మానవుడు అసలు ఆనందాన్ని కోల్పోతున్నాడు. ఈ విధమైన ప్రేమను పరతత్త్వముపైన మరల్చి పవిత్రమైన స్థానమును గమ్యమును, ధన్యమును గావించుకొనే రీతిలో దీనిని అనుభవించాలి. ఇట్టి దివ్యత్వమైన ఆనందము చదువులందు లేదు. శాస్త్రమందు లేదు. ఇది హృదయమందు మాత్రమే వుంటున్నది. ఇట్టి హృదయమునెరిగిన దివ్యత్వము ప్రాపంచికమైన విషయవాసనలయందు యేమాత్రము ప్రవేశించదు. మందార పుష్పమునందుగల మకరందమును గ్రోల కలిగిన యీ తుమ్మెద వుమ్మెత్త పువ్వులపైన వురుకులెత్తునా? ఆకాశగంగలో ఆనందముగా జలలాడుచున్న హంస యీ యొక్క ప్రాపంచికమైన మలిన జలములందు ప్రవేశించునా? చలగి మధువు గ్రోలిన మానవునకు చింతపండు రుచించునా? దివ్యభావముల చేత, పవిత్రమైన వూహాల చేత అనంతమైన ఆశల చేత నింపబడిన యీ హృదయమునకు ప్రాకృతమైన, అనిత్యమైన, అశాశ్వతమైన, అసత్యమైన, క్షణభంగురమైన లోకమును ఆశించునా?

కనుక భక్తి అనగా కేవలము పరిపూర్ణమైన ప్రేమతత్త్వమే. ఇది చిత్తము యొక్క పరిపాకమే. కాయ కాయగా వుండినంత వరకు దీని యొక్క రుచి పులుపుగానే వుంటుంది. ఇదే పరిపక్వస్థితికి వచ్చేటప్పటికి మాధుర్యముగా మారుతుంది. ఫలముగా రూపొందుతుంది. అదేవిధముగనే మానవత్వము విషయసంబంధమైన లోకముతో కూడి వుండినంతవరకు కూడను యిది కేవలము సుఖదుఃఖముల తోనూ, ఆశానిరాశలతోనూ, నిందాస్తుతులతోనూ కూడి వుంటుంది. ఇట్టి పరిపూర్ణ స్థితిని అనుభవించిన వ్యక్తి సృష్టిస్థితిలయములకు పొంగడు, కృంగడు, ఆనందించడు, దుఃఖము ననుభవించడు. భక్తి అనగా మనము చేరే గమ్యమునకు మార్గమే. వేదము కేవలము ఒక మార్గమే. వేదాంతమే ఒక గ్రామము. ఈ గ్రామమనే వేదాంతమును చేరేంతవరకు కూడను వేదమనే మార్గమును మనము అనుసరించవలసినదే. వేదమనేది కేవలము దైవస్వరూపమని మనము భావించరాదు. ఇది కేవలము ఒక మార్గము మాత్రమేనని భావించాలి. ఇది కేవలము ఒక Guide Post గా మనము విశ్వసించాలి. దీనిని మనము చక్కగా గుర్తించి వర్తించినప్పుడే గమ్యమును యేవిధమైన బాధలు లేకుండా చేరగలము. కనుక భక్తి తత్త్వమనేది ప్రేమమయముగా మార్చి దివ్యమైన స్వరూపకముగా తీర్చిదిద్దేది. ప్రేమ స్వార్థరహితమైనది. భగవంతుని యొక్క తత్త్వము కేవలము ఒక శిక్షయందు కూడను రక్షణ కలిగిస్తుంది. కోపమునందు కూడను కరుణను వెదజల్లుతుంది. దండన యందు కూడను దయను ప్రసరింపజేస్తుంది. కనుక దండన దండన యని మనము దూషించరాదు. దయను పొందే మార్గమే దండనం కరుణను చే

కూర్చు నిమిత్తమే యీ క్రోధము. రక్షణ పొందే నిమిత్తమే యీ యొక్క శిక్ష. ఈ విధమైన అర్థములను గుర్తించి పవిత్రమైన భావముతో దానిని స్వాగతము గావించిన వ్యక్తియే నిజమైన భక్తుడు. నిరంతరము కూడను మనము యీ ప్రాకృతమైన చింతనలయందే జీవితము వ్యర్థము చేయరాదు. ఇట్టి దైవత్వమును పొందే మార్గములు నవవిధములుగా బోధిస్తూ వచ్చారు.

శ్రవణం కీర్తనం విష్ణోస్మరణం పాదసేవనం
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనం.

ఒక్కొక్కరు ఒక్కొక్క మార్గమున గమ్యమును చేరి ధన్యత చెందిన వ్యక్తులు, మహాభక్తులు గొప్ప చక్రవర్తులు.

శృంగుని చేత శాపమును పొంది ఏడుదినములలో మృత్యువును అనుభవించగలడని వార్తను అందిన క్షణమే యీకాలమును సార్థకము గావించుకొని ఒక్క క్షణమైనా నిరర్థకము చేయరాదని చెప్పి పరీక్షన్మహారాజు ఋషులను ఆహ్వానించాడు. కాలము వ్యర్థము జీవితమే వ్యర్థమని చింతించాడు. ఋషులను ప్రార్థించాడు. ఈ ఏడు దినములలో పలనేను వ్యర్థము గావించని మార్గము బోధించమని ప్రార్థించాడు. ఆసమయమునకే శుకమహర్షి ప్రవేశించాడు. ఎవరికి లభించని ప్రాప్తి తాను అనుభవించినానని గుర్తించి, యీ ఋషి నాకిచ్చినది శాపము కాదు మహా వరప్రసాదమని భావించాడు. ఈ చక్రవర్తి యీ ఋషిని స్వాగతము చేసి 'స్వామీ! యీనాడు నేను ధన్యుడనైతిని. ఈ ఏడు దినములు సార్థకము చేసుకునే మార్గము నాకు ఉపదేశించమని కోరాడు. భగవంతుని యొక్క లీలాగుణగణ విశేషణములను కళ్యాణాద్భుతమైన తత్వములను నిరంతరము రాత్రింబవళ్ళు బోధించటానికి ప్రయత్నించాడు శుకుడు. ఈ ప్రేమ ప్రవాహమునందు మానవులయొక్క హృదయము ఒకవిధమైన ఆనంద డోలికలాడుతూ వచ్చింది. ఈ బోధనలయందు చేరిన ఋషులందరి మనసులు మత్తెక్కాయి. తన్మయము చెందారు. ఉన్మత్తులయ్యారు. ప్రేమోన్మత్తులయ్యారు. ఈ యొక్క పరిస్థితిని గుర్తించిన చక్రవర్తి ఆనందములో మునిగి పోయాడు. ఈ పరీక్షన్మహారాజు ఒకక్షణమైనా కాలము వ్యర్థము చేయక దైవచింతనము శ్రవణము చేసి, గానమును ఆనందముగా అనుభవించి హృదయ కుహరమునందు చేర్చుకున్నాడు. కనుక శ్రవణము చేత దివ్యత్వాన్ని అనుభవించినవాడు పరీక్షన్మహారాజు.

కీర్తనము. భగవంతుని నిరంతరము కీర్తించుచూ, భజించుచూ, స్మరించుచూ తరించటానికి తగిన మార్గాన్ని ప్రజలకు బోధిస్తూ వచ్చాడు శుక మహర్షి. ఈ విధమైన రీతిగా కీర్తనలు పలుపుచూ జీవితమును సార్థకముగావించుకున్నవాడే శుకమహర్షి

విష్ణుస్మరణం. నిరంతరము హరినామకీర్తనయందు తన హృదయమును హరింప చేసుకున్నాడు. కష్టములయందు, దుఃఖములయందు, బాధలయందు కూడను నమోనారాయణా నిరంతరము హరినామమునే చింతిస్తూ వచ్చెడు యీ ప్రహ్లాదుడు. రాక్షసులు యెన్నివిధములుగా బాధించినప్పటికిని యేమాత్రము దుఃఖమునకుగాని, విచారమునకుగాని తన హృదయమున చోటివ్వక నిరంతరము ఆనందములోనే తన హృదయాన్ని నింపుకున్నాడు.

తన్ను నిశాచరులు బాడవ దైత్యకుమారుడు మాటిమాటికో
పన్నగశాయి! యో దనుజభంజన! యో జగదీశ! యో మహా
పన్నశరణ్యా! యో నిఖిలపావన! యంచు నుతించుగాని తా
గన్నులనీరు దేడు భయకంపసమేతుడు గాడు భూవరా!

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్
మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడనా
దేహియె దేవదేవుడు మదిన్ తలపోయగ నాత్మరూపుడౌ

దైవతత్త్వమున దృష్టి మరల్చిన ప్రహ్లాదునకు దేహచిత్తము యేరీతిగా కనుపిస్తుంది. దేహము తనది కాదు. ఇది కేవలము ఒక నీటి బుడగ వంటిది. శరీరము ద్వారా శరీరిని పొందే నిమిత్తము యేర్పడినది. కనుక యీ శరీరముపైన ప్రజ్ఞ యేమాత్రము లేక నిరంతరము హరి చింతనే గావిస్తూ జన్మను సార్థకము గావించుకున్న వ్యక్తి చక్రవర్తి యీ ప్రహ్లాదుడు.

పాదసేవనం. ఇది అందరికి లభ్యమయ్యేది కాదు. లభ్యమైనప్పటికిని యేదో ఒకవిధమైన లౌకికమైన దృష్టితో పాదసేవన చేస్తూ రావచ్చును. కాని యీ యొక్క సేవయందు తన మనసును అంకితముగావించి సమస్త సృష్టికి కూడను యీ పాదములే ప్రమాణము ప్రధానమనే రీతిగా భావించి, యిది కేవలము బ్రహ్మకడిగిన పాదముగా భావించి, సమస్త జగత్తును కూడను ఆక్రమించిన పాదముగా విశ్వసించి, సర్వత్ర వ్యాపించిన దివ్యమైన చరణములే యీ చరణములని విశ్వసించి అట్టిసేవయే నా సాధన అని భావించినది లక్ష్మి. కనుక పాదసేవయందు లక్ష్మి తన యొక్క జన్మము సార్థకము చేసుకొంది.

అర్చనము. ఈ అర్చనమునకు పృథు చక్రవర్తి. సర్వకాల సర్వావస్థలయందు కూడను హరిఅర్చన తప్ప అన్య అర్చనలు తనకేమాత్రము కూడను తెలియదు. విశ్వం విష్ణుస్వరూపం. సహస్రశీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్. అనేక శిరస్సులతో అనేక నేత్రములచే, అనేక పాదములచే వుండినటువంటివాడు అతనే. ప్రపంచములో

ని ప్రాణులన్నియు కూడను పరమాత్మని అంశములే. పరమాత్మ స్వరూపములే. ఇట్టి భావముచే తాను నిరంతరము యేది చేసినా, యేది చూచినా, యేది చెప్పినా, యేది తలచినా దైవపూజ గానే భావించాడు. ఈ విధమైన అర్చనల చేత జన్మము సార్థకము గావించుకున్నవాడు పృథు చక్రవర్తి.

కేవలము ఒక్క వందనము చేతనే తన జన్మము సార్థకము గావించుకొన్న వాడు అక్రూరుడు. కేవలము వందన మనగా రెండు హస్తములు చేర్చుటము మాత్రము కాదు. ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు చేర్చి దశేంద్రియములు పరమాత్మ నికి అర్పితము గావించటమే. ఏతావాతా దీనినే శరణాగతియని విశ్వసించాడు. విశ్వాసము యొట్టిదో తన ఫలితము అట్టిది. కనుక యీ అక్రూరుడు సర్వత్ర కృష్ణస్వరూపాన్ని దర్శించగలిగాడు.

దాస్యం. దీనికి హనుమంతుడు. ఇతను నిరంతరము వినయ విధేయతల చేత రామచింతనతో కాలమును గడుపుతూ వచ్చేవాడు. ఇతను సామాన్యుడు కాదు. అరువదినాలుగు విద్యలను అన్ని విధములుగా కూడను తాను అర్థసహితముగా గ్రహించినవాడు పైశాచిక విద్యయందు మహాప్రవీణుడు. గజకర్ణ గోకర్ణ విద్యలందు మహాప్రవీణుడు. కృష్ణుడు చెప్పుచున్న గీతను పైశాచిక భాషలో ప్రప్రథమముగా రచించిన వాడు హనుమంతుడు. వ్యాసునికంటె పూర్వమే గీతను రచించిన మహనీయుడు యీ హనుమంతుడు. కనుకనే యితనికి టైటిల్‌గా యిస్తూ వచ్చాడు రాముడు. శాంతుడు, గుణవంతుడు, బలవంతుడు హనుమంతుడు అన్నాడు. ఏ పదార్థము ముట్టినప్పటికి ఆపదార్థములో రామనామము వున్నదా లేదా అని పరీక్షించేవాడు. రామనామము లేనివన్నీ రాళ్లతో సమాన మనుకున్నాడు. ఈ లంకకు వంతెన కట్టే సమయమునందు రాళ్లను ఎత్తి రామా అని వేసినప్పుడు అది తేలుతూ వచ్చింది. ఇతడు మహాగుణవంతుడు కనుకనే ఒక్కొక్క రాయిపైన రామా అని రాయలేదు. ఒకరాయిపైన రా రెండవరాయిపైన మ వ్రాస్తూ వచ్చాడు. ఈ రెండు రాళ్లు విసిరేటప్పటికి రెండు రాళ్లు చేరుతూ చేరుతూ వచ్చాయి. ఈ విధముగా వంతెన తయారై పోయింది. తన దేహమందున్న రోమ రోమము రామనామమునే తలుస్తూ వచ్చింది. మనము కష్టాల సమయములో యే దైవ చింతన మనము చేయము. సుఖసమయమునందు కూడను దైవాన్ని మరచిపోతుంటాము. సుఖదుఃఖ సమయములందు, రెండింటియందు కూడను సమత్వాన్ని వహించిన మహాబలవంతుడు యీ హనుమంతుడు. అహంకారము లేని గుణవంతుడు. మమకారము త్యజించిన మహనీయుడు లంకలో స్వేచ్ఛా విహారము సలుపుతున్న సమయమునందు రాక్షసులు ఎవరయ్యా నీవని ప్రశ్నించగా దాసోహం కోసలేంద్రస్య అట్టి ఆపద సమయమునందు కూడను

నేను రామచంద్రుని దాసుడను అని చెప్పుకున్నాడు. ఎట్టి పరిస్థితియందు కూడను ద్వేషుల ముందు కూడను నేను రామదాసుడనని గట్టిగా చెప్పేశక్తి గలవాడు. ఈనాడు భక్తులు ఎట్లావుంటారు. మందిరము పోయేటప్పటికి విభూతి పెట్టుకుంటారు. బయటకు పోయేటప్పటికి hand kerchief తీసుకు తుడుచుకుంటారు. స్వామి చెంత వుండినప్పుడు, సమీపములో సంచరించే సమయములందు అన్నివిధాలా కూడను భక్తులుగానే ప్రకటిస్తారు. ఏదైనా భక్తికి విరుద్ధమైన ప్రదేశములోకి పోయేటప్పటికి మేము సాయిభక్తులము కాము పోతూవుంటాము వస్తూవుంటాము అంతమాత్రమే ఇటువంటి పిరికి పందలు భక్తులు యేరీతిగా కాగలరు. ఎట్టి ప్రదేశమునందు పోయినప్పటికిని దానిని కొట్టి చాటాలి అలాంటి ధీరమైన శక్తితో కలిగి వుండాలి భక్తి. అవును నేను భక్తుడను. ఈ విధమైన ధీరత్వముతో కూడినవాడు హనుమంతుడు. కనుకనే తాను సేవలను ఆచరిస్తూ తన జన్మను సార్థకము గావించుకొని చిరంజీవిగా నిలచిపోయాడు.

ఇంక మైత్రి. ఇతనే అర్జునుడు. ఎలాంటి పరిస్థితులయందు కూడను కృష్ణుని ఎడబాయక తాను నిరంతరము వెంట జంటగా జీవిస్తూ వచ్చారు. ఎన్నో బాధలను అనుభవించారు. ఎన్నో నిందలను, నిష్ఠూరములను అనుభవించారు. కడకు తాము ఒక విధమైన అపకీర్తి పాలయ్యారు. ఎట్టి సమయమునందు కూడను కృష్ణా నీవు తప్ప మాకు అన్యము లేదు అని కేవలము ప్రార్థనతో అన్నివిధములుగా కృష్ణుని అండ చేరేవారు. నీవే తప్ప నితఃపరంబెరుగ నీవు తప్ప అన్యులు లేరని ప్రార్థించేవారు. ఇలాంటి వాడుగా, మిత్రుని గా భావించి, బంధువుగా విశ్వసించి అన్నింటియందు కూడను అర్జునుడు కృష్ణుని వుపయోగపెట్టుకొనేవాడు. కనకనే అతనికి రథసారథిగా కూడను నిలచి అనేక విధములైన విజయములను అందిస్తూ వచ్చాడు. భగవంతుని జీవితరథ సారథిగా నియమించుకున్నాడు. ఇతనినే పార్థసారథి అని పిల్చెడివారు. పార్థుని యొక్క జీవితమునకు సారథి.

ఇంక కడపటిది తొమ్మిదవది ఆత్మార్పణం. ఈ విధముగా ఆత్మార్పణ గావించి, అడిగిన దానిని అందించి తాను జీవితమును సార్థకము గావించుకున్నవాడు బలి చక్రవర్తి. ఇతను ప్రహ్లాదుని మనుమడు. ఇతను భగవంతుని యొక్క భక్తి ప్రపత్తులలో లీనమైనవాడు. విశ్వజిత్ అనే యాగము చేసి విశ్వమునే విజయమును సాధించినవాడు. తన శిరస్సునే తాను అర్పితముగావించి పాతాళలోకమునకు ప్రవేశించినవాడు. ఏ విధముగానైనప్పటికి తన యొక్క అనుగ్రహమే నాకు ప్రధానమని విశ్వసించినవాడు. తనగురువైన శుక్రాచార్యుడు దానమునకు అడ్డు తగిలినప్పటికిని లేదు లేదు నాదేహము, నాకాయము నాకర్మము, నాకర్తవ్యము సర్వము కూడను భగవదర్పితమేనని భావించాడు.

కనుక ప్రాచీన కాలమునుండి కూడను నవవిధములైన భక్తిమార్గము

లను అనుభవిస్తూ, నవవిధమువైన మార్గములను ఆదర్శముగా నిరూపించిన చక్రవర్తులు, మహా భక్తులు. అయితే యీ భక్తి కేవలము వ్యక్తిగతమైనదిగా నిరూపించటానికి మంచిది కాదని విశ్వసిస్తూ వచ్చారు. సమిష్టి స్వరూపమైన ప్రార్థనలు అత్యవసరమని భావిస్తూ వచ్చారు. ఎవరికి వారు ప్రార్థన చేసుకోటము, ఎవరికి వారు భగవంతుని చింతించటము యిది స్వార్థమైనదని కూడను తలచుతూ వచ్చారు. స్వార్థమనేది పరార్థమును పొందలేదనేది విశ్వసించారు. క్రైస్తవులయందు కూడను, మహమ్మదీయుల లోపల కూడను కొన్ని విధములైన గ్రంథములో వుండిన విషయాన్ని ఒకరు ఉచ్చరించటము తిరిగి అక్కడ చేరిన వారందరు కూడను దానిని ఉచ్చరించి ఫాలో చేయటము యీ విధముగా జరుగుతూ వచ్చేది. సామూహిక ప్రార్థనలు అత్యవసరమని భావించారు. లోకాస్సమస్తా సుఖినో భవంతు అనే భావాన్ని అందుకున్నారు. ఈ విధమైన భావాన్ని అవలంబించినప్పుడు దేశము సుక్షేమాన్ని అనుభవిస్తుందని కూడను తలంచారు. 1469 లో సిక్కుల గురువైన గురునానక్ యీ సామూహికమైన భజనలు ప్రారంభించాడు. ఈ భజనలకు మొట్టమొదటి పునాది గురునానక్. ఇది క్రమక్రమేణా పెరుగుతూ వచ్చింది. తదుపరి 1498 లో త్యాగరాజు రాగతాళ భావములతో దానిని సమకూర్చుతూ వచ్చాడు. అప్పటినుండి మన భారత దేశములోపల సామూహిక భజనలంటూ ప్రారంభమవుతూ వచ్చాయి. ఈ భజనలనేవి కేవలము ఒక విధమైన కాలహరణము గావించుకొనే కర్మలు కాదు. అందరి మనస్సులు, అందరి భావములు, అందరి రాగములు, అందరి తాళములు కూడను ఏకమైపోయి దివ్యత్వమైన అనేకత్వములోని ఏకత్వమును నిరూపించినదే భజన అని గుర్తిస్తూ వచ్చారు. ఏతావాతా దీని అంతరార్థమేమన సామూహిక భజనలు చాలా సారవంతమైనవి. సమర్థమైనవి. భక్తియందు భజనలకు ప్రధానమైన స్థానమును అందిచ్చారు. ఈ భజనలు కూడను ప్రేమపూరితమైన భజనలు కావాలి. పల్లెల యందు యిది మొట్టమొదటు ప్రారంభించినప్పుడు త్యాగరాజు చెప్పాడు

> రండి పుణ్యాత్ములారా! శ్రీరాముని భజనకు రండి ధన్యాత్ములారా!
>
> రండి మనమందరము కోదండరాముని భజనలు చేతము రండి పుణ్యాత్ములారా!
>
> శ్రీరాముని భజనకు రండి ధన్యాత్ములారా!

యీ పాటను ప్రారంభించాడు. రండి మనమందరము కోదండరాముని భజనలు చేద్దాము ఈ కోదండపాణి దండపాణిని దూరము చేయగలడని భావించాడు. దండపాణి యముడు. కోదండపాణి రాముడు. కోదండపాణి నామము దగ్గర వున్నప్పుడు దండపాణి సమీపించలేడన్నాడు. ఇలాంటి విశ్వాసముతో, యిలాంటి పరిపూర్ణమైన ప్రేమతో దివ్యమైన భావముతో భజనలు ప్రారంభమైనాయి.

408108809

కాని యీనాడు అట్టి పవిత్రత కోల్పోయింది. రాగతాళములే ప్రధానముగా చూస్తున్నారే గాని భావరాగములు యేమాత్రము చూడటం లేదు. పదిమందికి ఒక యింపైన రాగము కోసము ప్రయత్నము చేస్తున్నామే గానీ యింపైన భావాన్ని మనము అందించటానికి పూనుకోలేదు. ఈ భజనలో వుండిన భావములు హృదయాన్ని కదిలించి, కరిగించాలి. ఆవిధమైన దానిలోపల యీ భక్తి ప్రారంభమవుతూ వస్తుంది.

ప్రేమస్వరూపులారా! భక్తి భక్తి అంటే కేవలము ఒకవిధమైన భగవంతుని పూజలు మాత్రమే కాదు. ప్రధానమైనది ప్రేమ. ఈ ప్రేమ అందరియందు వుండిన ప్రేమనే. ఈ ప్రేమను ఏకత్వము గావించుకొనే మార్గమే నిజమైన భక్తిగా భావించాలి. దేవుని పూజించటము, జీవుల్ని బాధించటము భక్తి కానేరదు. సర్వుల యందు వుండిన భగవంతుని మనము ప్రార్థించాలి. ఆభగవంతుడు ఎవరు? Love is God. Live in Love. అతనే ప్రేమస్వరూపుడు. ప్రేమనిమిత్తమై మనము ప్రేమను అభివృద్ధిపరచుకోవాలి. ఈ ప్రేమనే పరమాత్మ స్వరూపము. అదియె భక్తికి రూపము. అదే దివ్యత్వానికి ప్రతిబింబము. అదే ఆత్మానందమునకు గమ్యము. కనుక ఆనందము మనయందే వున్నది. మనము ఎక్కడో వెతకనక్కరలేదు. సర్వత్రా వుండిన భగవంతుని వెతికేది యెక్కడ. వెతకటమనేది వెఱ్ఱితనము. తన దృష్టిని అంతర్ముఖము గావించుకోవాలి. బహిర్ముఖముగా పరుగెత్తే భావములంతా అరికట్టి భగవంతుని వైపు మరల్చండి. సర్వకర్మ భగవత్ ప్రీత్యర్థముగా భావించండి. ఇదియే గొప్పవిద్య. ఈ విశాలమైన విద్య మనము అభ్యసించాలి. ఈ అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవించాలి. అఖండమైన తేజస్సును మనము అనుభవించాలి. ఇదే జీవితముయొక్క ప్రధాన గమ్యము. ఇదే నిజమైన జీవితము యొక్క మార్గము. ప్రేమ కోసమై మనము ప్రేమించుతూ రావాలి. ఇదే way of life. ఈ విధమైన భక్తితో మనము ప్రేమను పెంచుకోవాలి గానీ భక్తి భక్తి యని పూజలు, పునస్కారములు, యాత్రలు యీ విధమైన కర్మలాచరించినంత మాత్రమున భక్తి కానేరదు.